క్లుప్తంగా

రాజగోపాల్‌పేట ఎస్‌ఐగా రాజు



నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట ఎస్‌ఐగా ఎల్ రాజు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఎస్‌ఐగా పనిచేసిన మహిపాల్‌రెడ్డిని రాజన్న సిరిసిల్ల జిల్లా జోన్‌లోని కరీంనగర్ హెడ్‌క్వాటర్‌కు అటాచ్ చేశారు. ఆయన స్థానంలో మెదక్ పట్టణ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఎల్ రాజు బదిలీపై ఇక్కడికి వచ్చారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవీందర్



హుస్నాబాద్: 2023–24 సంవత్సరానికి గాను హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఎన్నికల అధికారి జుమ్‌లాల్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికలు కొనసాగాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిత్తారి రవీందర్, ఉపాధ్యక్షుడిగా కన్నోజు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బాకం సంపత్, జాయింట్ సెక్రటరీగా జేరిపోతుల రవీందర్, లైబ్రరీ సెక్రటరీగా బానోతు శ్రీనివాస్‌నాయక్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కొంకట శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా శ్రీదేవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డి. వెంకటయ్యయాదవ్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ధీకొండ ప్రవీణ్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



నగదు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దుబ్బాక: మండల పరిధిలోని మహ్మద్‌షాపూర్ గ్రామ ఉపసర్పంచ్ కవిత భర్త, బీఆర్‌ఎస్ కార్యకర్త రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ స్వప్నపూర్ణయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ ఇప్ప లక్ష్మి, ప్రజాప్రతినిధులు కలిసి శనివారం ఆయనను పరామర్శించి రూ.25వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, నవీన్, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.

దుబ్బాక తైబజార్ వేలం రద్దు



వేలంలో చైర్‌పర్సన్ వనిత, కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీకి సంబంధించిన తైబజార్ వేలం మూడోసారి సైతం రద్దయింది. ఇప్పటికే రెండు పర్యాయాలు తైబజార్ వేలం రద్దు కాగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అధ్యక్షతన జరిగిన వేలం పాటకు ఆశించిన స్పందన రాకపోవడంతో మళ్లీ రద్దు చేస్తున్నట్లు కమిషనర్ గణేశ్‌రెడ్డి తెలిపారు. గత సంవత్సరం తైబజార్ వేలాన్ని రూ.15 లక్షలకు నిర్ణయించగా ఇప్పుడు అంతకన్నా తక్కువ రావడంతో వాయిదా వేశామన్నారు. మూడు సార్లు తైబజార్ వేలం రద్దు కావడంతో తదుపరి చర్యల కోసం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మి

దుబ్బాక: రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పాడి పరిశ్రమ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని దౌల్తాబాద్, రాయపోల్ మండలాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇప్ప లక్ష్మి అన్నారు. శనివారం రాయపోల్ మండలంలోని బేగంపేట గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతును రాజుగా చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో పశు సంపదను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ రైతుపై ఉందన్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి జాన్‌వెస్లీ, సర్పంచ్ ప్రవీణ్, ఎంపీటీసీ వెంకటయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, తదితరులున్నారు.

ఎల్‌ఓసీ అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని బేగంపేటకు చెందిన జి.నితిన్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో నితిన్‌కు చికిత్స నిమిత్తం మంజూరైన రూ.2.50 లక్షల విలువైన ఎల్‌ఓసీని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి శనివారం అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటయ్య, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

- సీడీపీఓ వెంకటరాజమ్మ
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ్ వారోత్సవాలు



జగదేవ్‌పూర్(గజ్వేల్): మాట్లాడుతున్న సీడీపీఓ వెంకటరాజమ్మ

జగదేవ్‌పూర్(గజ్వేల్): చిరుధాన్యాలతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ వెంకటరాజమ్మ అన్నారు. శనివారం జగదేవ్‌పూర్ సెక్టార్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా చిరుధాన్యాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుధాన్యాల్లో పోషక విలువలు ఉంటాయని, దీంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే అనారోగ్య సమస్యలు దరిచేరవని, బీపీ, షుగర్ రాకుండా ఉంటాయని తెలిపారు. పిల్లలు, తల్లులు చిరుధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలని కోరారు. వెలిబేబీ షో కార్యక్రమంలో ప్రతిభ చాటిన బాలికకు బహుమతిని అందించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సునీత, ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, వైద్యుడు సత్యప్రకాష్, సర్పంచ్ లక్ష్మీ, ఎంపీటీసీ కవిత, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని నందారం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సిబ్బంది చిరుధాన్యాలను తినండి.. ఆరోగ్యంగా జీవించండి అంటూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగాల ఎల్లయ్య, అంగన్‌వాడీ టీచర్ ఎలిజబెత్, ఉపసర్పంచ్ శ్రీనివార్‌రెడ్డి, ఏఎన్‌ఎం, ఆశకార్యకర్త, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: చిరుధాన్యాలు వినియోగించడంతో కలిగే లాభాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షబానా,



మద్దూరు(హుస్నాబాద్): పోషణ్ అభియాన్ ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

సర్పంచ్ మద్ద ప్రవీణ్ అన్నారు. శనివారం రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రామారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నజియా తబుస్సుమ్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులున్నారు.

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని మర్మాముల గ్రామంలో సర్పంచ్ సుందరగిరి స్రవంతిపరశురాములు ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్



దుబ్బాక: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

వాడీ సిబ్బంది గర్భిణులు, బాలింతలకు పోషకాహారం గురించి ప్రదర్శనతో పాటుగా వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు.

దుబ్బాకరూరల్: పోషకాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రామక్కపేట గ్రామంలో గర్భిణులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు రాములమ్మ, బాలమణి, సరస్వతి మాట్లాడుతూ.. గర్భిణులు పోషకాలు గల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మప్రభాకర్, ఎంపీటీసీ శోభ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మసిరెడ్డితండాను హుస్నాబాద్‌లో కలపాలి

పంచాయతీ కార్యాలయం ఎదుట తండావాసుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మసిరెడ్డితండాను వెంటనే హుస్నాబాద్‌లో విలీనం చేయాలని నిరసిస్తూ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్తులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 20 కిలోమీటర్ల దూరంలో అక్కన్నపేట ఉందన్నారు. సరైన రోడ్డు మార్గం కూడా లేదని, దీంతో తాము నానా అవస్థలు పడుతున్నామన్నారు. మండలానికి చిట్టచివరి గ్రామంగా ఉండడంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉందన్నారు. కొంతమంది స్వార్థ రాజకీయ ప్రయోజనాలతో ఈ రోజు తాము అనేక ఇబ్బందుల పాలు కావాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, కలెక్టర్ చొరవ తీసుకొని వెంటనే ధర్మారం రెవెన్యూ గ్రామంతో పాటు మసిరెడ్డితండా గ్రామాన్ని హుస్నాబాద్‌లో కలపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు మాలోతు మోహన్‌నాయక్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జాటోతు రాజునాయక్, యూత్ అధ్యక్షుడు మాలోతు రమేశ్, రవినాయక్, భీమ్లానాయక్, ర్యాగటి మహిపాల్ పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



పనులను ప్రారంభిస్తున్న రజిత

హుస్నాబాద్: పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 1వ వార్డులోని నేతాజీ కాలనీలో టీయూఎఫ్‌ఐడీసీ కింద రూ.20లక్షల నిధులతో నిర్మించనున్న సీసీరోడ్ల పనులను శనివారం చైర్‌పర్సన్ రజిత ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణంలో ఇప్పటివరకు రూ.35కోట్లతో సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. కొత్త కాలనీల్లో అభివృద్ధి పనులు జరగాల్సి ఉందని, దశల వారీగా సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్ కొంకట నళినిదేవి, మాజీ ఎంపీపీ వెంకట్, కో–ఆప్షన్ సభ్యుడు శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ డాక్టర్ రవి, ఏఈ సాయిప్రణీత్ తదితరులు ఉన్నారు.

తైబజార్ నిర్వహణకు బహిరంగ వేలం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు అంశాలకు బహిరంగా వేలం నిర్వహించగా రూ.20లక్షల 38 వేల ఆదాయం వచ్చింది. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సార్ల లత అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి లోకేశ్‌రెడ్డి పార్కింగ్, తైబజార్, కూరగాయల అంగడి, సులబ్ కాంప్లెక్స్ నిర్వహణలకు వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మల్లన్న చెరువు వద్ద గల పార్కింగ్ వేలంను సార్ల శ్రీకాంత్ రూ.14లక్షల 2 వేలకు, కూరగాయల అంగడి వేలంను సానాది భిక్షపతి, సులబ్ కాంప్లెక్స్ గజ్జె అశోక్ రూ.2లక్షల 87 వేలకు, మల్లన్న ఆలయం వద్ద తైబజార్ వసూలు చేసుకునేందుకు సార్ల అజయ్ రూ.2లక్షల 61వేలకు హెచ్చుపాట పాడి వేలం"ఎదక్కించుకున్నారు. ఈ



వేలం నిర్వహిస్తున్న అధికారులు

వేలం పాటల హక్కులు ఒక సంవత్సరకాలం (01-04-2023 నుంచి 31-03-2024 వరకు) పాటు వర్తిస్తుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సిద్దప్ప, ఉపసర్పంచ్ కొండ శ్రీధర్, వార్డుసభ్యులు శ్రీనివాస్, ముత్యం పరశురాములు, చిక్కుడు కనకయ్య పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు పంపిణీ



క్రికెట్ కిట్‌ను అందిస్తున్న చైర్మన్ వంశీధర్ రావు

సిద్దిపేటరూరల్: రంగారావు ఫౌండేషన్ స్థాపన ప్రజల సేవ లక్ష్యంగా ముందుకు సాగుతుందని వంశీధర్‌రావు అన్నారు. శనివారం నారాయణరావుపేట మండల పరిధిలోని మల్యాల గ్రామంలో 14 క్రికెట్ జట్లకు, రూరల్ మండల పరిధిలోని తోర్నాల గ్రామంలో 25 జట్లకు కల్వకుంట్ల రంగారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వెంకట్, యూసఫ్, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

నైపుణ్యతను పెంపొందించుకోవాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): కేఆర్‌ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం రాత్రి మండల పరిధిలోని పెద్దకోడూరు, రామంచ, చంద్లాపూర్, మైలారం, మాచాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి

దుబ్బాక: ఏప్రిల్ 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలస్వామి అన్నారు. సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత శనివారం దుబ్బాకకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగాల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న కార్మికుల డిమాండ్ల సాధనకు తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాల కళావతి, జిల్లా కోశాధికారి భాస్కర్, నాయకులు తదితరులున్నారు.

పంచాంగం ఆవిష్కరణ

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో శనివారం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌ల చేతుల మీదుగా శుభకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు కిష్టయ్య, పాండుగుప్తా, మాంకాల పద్మాకర్, గంగిశెట్టి రాజ్‌కుమార్, శేఖర్, రాజు, సత్యం, విఠల్, సంతోష్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలి'

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్‌ఎస్‌కు బలం, బలగం కార్యకర్తలేనని మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి అన్నారు. పార్టీ ఆత్మీయ సమ్మేళనాల్లో భాగంగా శనివారం జగదేవ్‌పూర్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా గ్రామాల బూత్‌స్థాయి కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలపై ఊరురా ప్రచారం చేస్తామని, సబ్బండ వర్గాల ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే యూత్, విద్యార్థి విభాగాల కమిటీను కూడా ఎన్నుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కొండపోచమ్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి,



మాట్లాడుతున్న నాయకులు

సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేశ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, మండల అధ్యక్షురాలు కావ్య, రైతుబంధు మండల కో–ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఐలయ్య, సర్పంచ్‌లు చంద్రశేఖర్, రాజు, ఎంపీటీసీ కవిత, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

హుస్నాబాద్‌రూరల్: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులు వారిలోని ప్రతిభను వెలికితీయడానికి వార్షికోత్సవాలు వేదిక అవుతాయని ఎంపీపీ లకావత్ మానస అన్నారు. శనివారం కూచనపెల్లి ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అతిథులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాలకు ఎమ్మార్సీ నుంచి రూ.5000ల ప్రోత్సాహక బహుమతిని ఎంఈఓ దేశిరెడ్డి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కేసిరెడ్డి రాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ జయలక్ష్మి, కాంప్లెక్స్ హెచ్‌ఎం బండారి మనీల, హెచ్‌ఎం పద్మ, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి' తనిఖీల్లో అక్రమాలు

కార్యదర్శులపై ఏపీడీ ఆగ్రహం

నంగునూరు(సిద్దిపేట): ఉపాధి హామీ పథకంలో పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంపై ఏపీడీ కౌసల్యాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నంగునూరులో ఉపాధి హామీపై నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలు సమస్యలపై చర్చించారు. 12 గ్రామాలకు సంబంధించి నివేదిక సమర్పించారు. నివేదికలో భాగంగా పలు గ్రామాల్లో ల్యాండ్ లెవలింగ్ పనులకు సంబంధించి రైతుల అంగీకార పత్రం లేకుండా పనులు చేసినట్లు తనిఖీ బృందం గుర్తించింది. కొన్నిచోట్ల పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నట్లు వెల్లడైంది. నంగునూరు మండలంలో కూలీలకు జాబ్ కార్డులు కొత్త సాఫ్ట్‌వేర్‌లో



ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న అధికారులు

అప్‌లోడ్ చేయకుండా నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శులపై మండిపడ్డారు. తనిఖీలో రూ.36,637 జరిమానా విధించామని, పూర్తి వివరాలను త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ఏపీడీ తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

సిద్దిపేటజోన్: ప్రజల భవిష్యత్ అవసరాలను గుర్తించి మంత్రి హరీశ్‌రావు ప్రణాళికాబద్ధంగా వాటర్ రింగ్ ఏర్పాటు చేసినట్లు మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. శనివారం పట్టణంలోని 7వ వార్డులో ఆయన పర్యటించారు. ప్రజలకు భవిష్యత్‌లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానికంగా రూ.2కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీదేవి, సాయికుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మాజీ చైర్మన్ రాజనర్సు

ప్లాస్టిక్ రహిత సిద్దిపేట లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ సంపత్



హోటల్ నిర్వాహకుడితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సంపత్, తదితరులు

సిద్దిపేటజోన్: ప్లాస్టిక్ రహిత సిద్దిపేట లక్ష్యంగా సాగాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ సూచించారు. శనివారం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సుతో కలిసి 28వ వార్డులో పర్యటించారు. వార్డులో తడి, పొడి చెత్త విభజన, సేకరణ ప్రక్రియపై ఆరా తీశారు. బహిరంగ ప్రాంతంలో చెత్త వేయరాదని, మున్సిపల్ వాహనానికి చెత్త ఇవ్వాలని వార్డులో మహిళలకు సూచించారు. సకాలంలో పన్నులు చెల్లించాలని సూచించారు. యూజీడీ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. బాల సదనంలో పిల్లల ఆరోగ్యం, విద్యపై ఆరా తీశారు. మెదక్ రోడ్డు పక్కన ఉన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లను పరిశీలించి ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తీసుకుంటామన్నారు. స్వచ్ఛ సిద్దిపేటకు సహకారం అందించాలని సూచించారు. వారి వెంట కౌన్సిలర్ మల్లికార్జున్, అధికారులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

దుబ్బాకరూరల్: మండలంలోని రాజక్కపేట గ్రామంలో పోలీస్ కళాబృందంతో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ, ఎస్‌ఐ మహేందర్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల వలలో పడి డబ్బులు పోగొట్టుకోకూడదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే బ్యాంక్‌కు సంబంధించి వివరాలు, ఓటీపీ తదితర వివరాలు తెలపకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపకూడదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మపర్వతాలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 29న షాపుల వేలం

కోహెడ(హుస్నాబాద్): కోహెడ గ్రామ పంచాయతీ షాపులకు అద్దె కోసం ఈ నెల 29న వేలం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పెర్యాల నవ్య తెలిపారు. అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో ఉన్న మూడు పాత షాపు గదులు, ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన 12 కొత్త గదులతో పాటుగా వారసంతకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి జీపీ కోహెడ పేరుతో రూ.50వేలు డీడీని తీయాలన్నారు. (ఎస్‌బీఐ బ్యాంక్ జీపీ ఖాతా నంబర్ 62302055785) వేలంలో పాల్గొనేవారికి జీపీలో ఎలాంటి బకాయిలు ఉండకూడదన్నారు. అలాగే ప్రతీ అదివారం కొనసాగుతున్న వారసంత(అంగడి)కి ఈ నిబంధనలతోనే వేలం ఉంటుందన్నారు. వేలం ప్రారంభానికి ముందుగా డీడీలను గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమర్పించాలని కోరారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన తంగళ్లపల్లి కనకయ్యకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.17వేల విలువ గల చెక్కును శనివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

◆ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి తమ తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని గజ్వేల్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ కుమార్ పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం పరీక్షా ప్యాడ్‌లు, సామగ్రి అందజేశారు.

◆ జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 26, 27న సిద్దిపేటలో జరిగే జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని మండల నాయకుడు బోయిని వెంకట్ పిలుపునిచ్చారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో జన చైతన్యయాత్ర వాల్‌పోస్టర్లను హమాలీ కార్మికులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్మికులు నాంపల్లి, ఎల్లయ్య, స్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

◆ నియామకం

మద్దూరు(హుస్నాబాద్): దళిత జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బెక్కల్ గ్రామానికి చెందిన గుండె సంపత్‌ను నియమించినట్లు దళిత జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తనకు రాష్ట్ర ఉపాధ్యక్షుడి బాధ్యతలు ఇచ్చిన యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

◆ ఘనంగా స్వయంపాలన



మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శనివారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ జోగు ప్రభుదాస్, సర్పంచ్ మల్లన్నగారి శాంతవ్వ, ఉప సర్పంచ్ పరశురాములు, ఎస్‌ఎంసీ చైర్మన్ కనకయ్య, వైస్ చైర్మన్ నర్సింహులు హెచ్‌ఎం మల్లేశం బహుమతులు ప్రదానం చేశారు.

కేంద్రం కక్షపూరిత వైఖరి వీడాలి



గజ్వేల్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

- జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల నిరసన
- పలుచోట్ల మోదీ దిష్టిబొమ్మ దహనం



నంగునూరులో..

గజ్వేల్‌రూరల్: ప్రధాని మోదీ ప్రభుత్వం హిట్లర్ పాలనను కొనసాగిస్తోందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పార్లమెంటులో అనర్హత వేటు వేయడాన్ని ఖండిస్తూ శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డితో కలిసి నాయిని యాదగిరి మాట్లాడుతూ.. కేంద్రం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిలదీస్తున్న ప్రతిపక్ష పార్టీ నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులను బనాయిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రాహుల్‌గాంధీపై ఉన్న అనర్హత వేటును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు గుంటుకు శ్రీనివాస్, మొనగారి రాజు, రాములుగౌడ్, యాదగిరి, వహీద్‌ఖాన్, బాబా, శివుడు పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: సిద్దిపేట బస్టాండ్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు మోదీ ఫ్లెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రం, ఇమామ్, కలిముద్దీన్, యాదగిరి, సతీశ్‌గౌడ్, మహేందర్, రాకేశ్, అనిల్, అర్జున్ పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేస్తూ పార్లమెంటరీ కార్యదర్శి నిర్ణయం తీసుకోవడం తగదని కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలీమొద్దీన్ అన్నారు. ప్రతిపక్షాలను లేకుండా చేయడమే బీజేపీ పనిగా పెట్టుకుందన్నారు. రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్ర సక్సెస్ కావడంతో బీజేపీలో భయం పట్టుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో శనివారం ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేసిన వారిలో నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీధర్, జలంధర్‌రెడ్డి, యాదవరెడ్డి, భూపాల్‌రెడ్డి, మల్లేశం, మధు, చంద్రశేఖర్, మమ్ముగౌడ్, యాదగిరి, భూమయ్య, స్వామి, అనిల్, చందు, సుమలత, సాజిత్, రంజీత్, మహేష్, శ్రీను, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): నంగునూరులో ప్రధాన మోదీ దిష్టిబొమ్మ దహనం చేసిన వారిలో టీపీసీసీ సంయుక్త కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, మండల అధ్యక్షుడు శంకర్, ఎంపీటీసీ నితిన్‌కుమార్, యాదగిరి, శ్రీకాంత్, సత్తయ్య, పవన్, కనకయ్య, రాజేశ్వర్, కృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: పట్టణంలో శనివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ కుట్ర పూరిత విధానాలను ప్రజలు గమనిస్తున్నారని తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.